క్లుప్తంగా

రాయితీ పునరుద్ధరించాలి

కామారెడ్డి అర్బన్: రైలు ప్రయాణంలో సీనియర్ సిటిజన్లకు గతంలో కల్పించిన 50 శాతం రాయితీని కరోనా సమయంలో ఎత్తివేసినందున మళ్లీ పునరుద్ధరించాలని కామారెడ్డి పట్టణ కాకతీయనగర్ కాలనీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు డీవీఎల్ఎన్ శర్మ రైల్వే ఉన్నతాధికారులను వినతిపత్రం ద్వారా కోరారు. ఎన్ని విజ్ఞప్తులు చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

బీర్కూర్‌లో మాజీ ఎమ్మెల్యే పర్యటన

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి పర్యటించారు. స్థానిక వెంకటేశ్వర ఆలయంలో కొనసాగుతున్న సప్తాహానికి హాజరై పూజలు చేశారు. పాండురంగ వార్కారీలతో కలిసి భజనలు చేశారు. అనంతరం బీర్కూర్ సొసైటీలో పని చేసే అంబయ్య అనే వ్యక్తి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు బస్వరాజ్, ప్రతాప్‌సింగ్, నందురెడ్డి, బోయిని శంకర్, కమలాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

వ్యాయామంతో సత్ఫలితాలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి రోజు దివ్యాంగ పిల్లలకు ఇంటి దగ్గర వ్యాయామం చేయించడం వల్ల సత్ఫలితాలు ఉంటాయని ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి తెలిపారు. బుధవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహించి, పిల్లలకు వ్యాయమాలు చేయించారు. అనంతరం తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. విఠల్, రాందాస్, రాథోడ్ బలరాం, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లల గుర్తింపు

మాచారెడ్డి: అక్కాపూర్‌లో ఇటుక బట్టీలో పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లలు ఏడుగురిని బుధవారం అధికారులు గుర్తించి బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా సీఆర్పీ దేవ సంజీవ్ మాట్లాడారు. బడీడు పిల్లలతో పని చేయించకుండా బడిలో చేర్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు మంజుశ్రీ, ఇటుక బట్టి యజమాని భగవాన్ ఉన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

రామారెడ్డి(ఎల్లారెడ్డి): ఉప్పల్‌వాయి ఇటుక బట్టీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆవాస ప్రాంత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టేషనరీ సామగ్రిని బుధవారం అందజేశారు. అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన కుంట నవీన్, సీఆర్పీ మహమూద్ ఆధ్వర్యంలో అందించారు.

సమాజ సేవే నిజమైన దేశభక్తి



రామారెడ్డి(ఎల్లారెడ్డి): సమాజ సేవే నిజమైన దేశభక్తి అని సెవెన్ హార్స్ ఎన్జీవో అధ్యక్షుడు జీవన్ నాయక్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ సెవెన్ హార్స్ ఆర్గనైజేషన్ ఎన్జీవోస్, బాంబే క్లాత్ హౌస్ సహకారంతో రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట్‌లో రూరల్ క్యాంప్ బుధవారం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు టీ షర్టులు, దుప్పట్ల పంపిణీ చేశారు. సర్పంచ్ సునంద మాట్లాడుతూ.... సేవ చేయడానికి మా గ్రామాన్ని ఎంచుకున్న ఎన్జీవోస్‌కు ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలు చదువుతో పాటు సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు.

ప్రొఫెసర్‌ను కలిసిన సర్పంచులు

భిక్కనూరు: మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు ప్రొఫెసర్ కోదండరాంను హైదారబాద్‌లో బుధవారం కలిశారు. సర్పంచ్‌ల రాష్ట్ర స్థాయి సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరాంను భిక్కనూరు మండల సర్పంచ్‌లు తున్కి వేణు, నర్సింలు యాదవ్, మధుమోహన్‌రెడ్డి, గుడిసె రాములు కలిసి 15వ ఫైనాన్స్ నిధులను వెంటనే విడుదల చేయాలని, సర్పంచుల పదవీ కాలం ముగిసినందున వారికే పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించాలని, ఐదవ విడత పల్లె ప్రగతి నిధులను విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి తమ తరఫున విన్నవించాలని కోరారు.

రేషన్ దుకాణాల తనిఖీ

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి, మంగ్లూర్ గ్రామాల్లోని రేషన్ దుకాణాలను బుధవారం రాత్రి స్థానిక తహసీల్దార్ భిక్షపతి, గిర్దావర్ అంజయ్య తనిఖీ చేశారు. రేషన్ బియ్యం కోసం వచ్చే ప్రతీ ఒక్క కుటుంబానికి బియ్యం పంపిణీ చేయాలని డీలర్లను ఆయన ఆదేశించారు. నిబంధనల ప్రకారంగా రేషన్ దుకాణాలను డీలర్లు తెరచి ఉంచాలన్నారు.

బోరు బావుల తవ్వకం

లింగంపేట(ఎల్లారెడ్డి): అయ్యపల్లి, శెట్పల్లి, భవానిపేట, కంచుమల్ గ్రామాల్లో బుధవారం బోరుబావుల తవ్వకాన్ని ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జెడ్పీటీసీ నిధులతో బోరు బావులు తవ్వకం చేపట్టినట్లు తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో ప్రజల దాహర్తి తీర్చడానికి బోరుబావులు తవ్విస్తున్నట్లు తెలిపారు.

పరదాల చాటున బోధన

- తరగతి గదుల కొరతే కారణం
- రామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో ఇదీ పరిస్థితి



శిథిలావస్థకు చేరిన బాలుర పాఠశాల



రామారెడ్డి పాఠశాల తరగతి గదిలో మధ్యలో పరదాను ఏర్పాటు చేసి రెండుగా విభజించిన దృశ్యం

రామారెడ్డి (ఎల్లారెడ్డి): సర్కార్ బడులు సమస్యలకు నిలయంగా మారుతున్నాయి. ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ బడుల తలరాత మాత్రం మారడం లేదు. తరగతి గదుల కొరత కారణంగా ఒకే తరగతి గదిని మధ్యలో పరదాలను ఏర్పాటు చేసి రెండు తరగతులకు విద్యా బోధన చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరత కారణంగా ఈ విధంగా బోధిస్తున్నారు. ఇప్పటికే ఈ పాఠశాల మన ఊరు– మన బడిలో భాగంగా మొదటి విడతలోనే ఎంపికైంది. రూ.98 లక్షల నిధులతో శిథిలావస్థలో ఉన్న తరగతి గదుల స్థానంలో కొత్త తరగతి గదులు నిర్మించాల్సి ఉంది. బిల్లులు రావనో.. ఉన్న నిధులతో తరగతి గదులను నిర్మించలేమనో 8 సార్లు తరగతి గదుల నిర్మాణానికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఉపాధ్యాయులే మధ్యలో ఒక పరదాను ఏర్పాటు చేసి బోధిస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్ విద్యావ్యవస్థకు పెద్ద పీట వేయాలని మేధావులు కోరుతున్నారు. త్వరితగతిన అవసరమున్న చోట తరగతి గదులను నిర్మించాల్సి ఉంది.

చెల్లించింది ఎక్కువ.. రసీదుల్లో తక్కువ



ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణానికి పంచాయతీ సిబ్బంది అధికంగా డబ్బులు తీసుకుని తక్కువ మొత్తానికి రసీదులు ఇచ్చారని లబ్ధిదారులు మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు ఫిర్యాదు చేశారు. తహసీల్ కార్యాలయ ఆవరణలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే రాగా గృహనిర్మాణదారులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తాము డబుల్ బెడ్‌రూం ఇంటి నిర్మాణం కోసం అనుమతి కోసం వెళ్లగా రూ.14 వేల నుంచి రూ.22 వేల వరకు తీసుకున్నారని, రసీదు మాత్రం రూ.982 ఇచ్చారని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయంపై విచారణ చేయాలని ఎంపీడీవోకు ఆదేశించారు.

ఏబీవీపీ యువజన వారోత్సవాలు



బాన్సువాడ: స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ల జయంతిని పురస్కరించుకుని ఏబీవీపీ యువజన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12న స్వామి వివేకానంద, 23న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల సందర్భంగా ఈ నెల 18, 19వ తేదీల్లో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆయా కళాశాలల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రికెట్, ఖోఖో, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు హనుతేజ్, జశ్వంత్, నగేష్, ఆనంద్, అభిషేక్, గణేష్, అజయ్, హన్మాండ్లు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ భూములకు కొలతలు



కొలతలు వేస్తున్న అధికారులు

దోమకొండ: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఆర్టీసీ భూములకు బుధవారం రెవెన్యూ అధికారులు కొలతలు తీసుకున్నారు. ఇటీవల ఆర్టీసీ బస్టాండ్‌కు మరమ్మతులు చేసి సీసీ రోడ్డు వేశారు. అనంతరం ఆర్టీసీ భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణానికి పనులు చేపట్టారు. తమ కాలనీకి 40 ఫీట్ల రోడ్డును వదిలి ప్రహరీ నిర్మించుకోవాలని కోరుతూ పెద్దమ్మ కాలనీవాసులు ఆర్టీసీ డీఎంతో పాటు ప్రజాప్రతినిధులకు వివరించారు. దీంతో రెవెన్యూ సర్వేయర్ రాకేష్, జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి సమక్షంలో కొలతలు వేశారు. 40 ఫీట్ల రోడ్డు వదిలి నిర్మాణం చేయాలని కోరుతూ తాము జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో బుధవారం సోషల్ వర్క్ విభాగం ఎన్ఎస్ఎస్ ఐదవ, ఆరవ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సెలర్ మాట్లాడుతూ.. అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదన్నారు. ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చని సూచించారు. విద్యార్థులు రక్తదానంపై ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. ఎన్ఎస్ఎస్ బాధ్యులు అంజయ్య, హరిత, ప్రొఫెసర్లు మోహన్‌బాబు, సబిత, తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 14 ఎంపీటీసీల పరిధిలోని గ్రామాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్లు ఎంపీపీ గరీబున్నిసాబేగం తెలిపారు. ఆయా గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్లు, బోరు బావుల తవ్వకం, మురికి కాల్వలు, మహిళా సంఘాల భవనాల మరమ్మతులు, తాగు నీటి కోసం, తదితర పనులకు వినియోగించాలని సూచించారు. ఒక్కో ఎంపీటీసీ పరిధిలోని గ్రామాలకు రూ.2 లక్షల చొప్పున మంజూరైనట్లు ఆమె పేర్కొన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత



మాచారెడ్డి: ఫరీదుపేట, పాల్వంచ మర్రి గ్రామాల్లో బుధవారం ఎయిడ్స్ మహమ్మారి నియంత్రణపై కళాకారులు ఆటపాటలతో అవగాహన కల్పించారు. అలాగే తాగుడుకు బానిస కావద్దని ప్రదర్శించిన నాటిక అందరినీ అలరించింది. రీసోర్స్ పర్సన్ లింగస్వామి, లింక్ వర్కర్ బాల్ కిషన్ ఉన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



రాజంపేట: మహిళా సంఘ సభ్యులు సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ డీపీఎం ఫామ్ వకులా అన్నారు. బుధవారం రాజంపేట మండలం పెద్దపల్లి గ్రామంలో ఇందిరా మహిళా సంఘ సభ్యురాలు అన్నపూర్ణ పిండి గిర్ని యూనిట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సబ్సిడీ రుణాలతో మహిళా సంఘంలోని ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఏపీఎం సాయిలు, బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్, మండల అధ్యక్షురాలు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మొదలైన సంక్రాంతి సంబరాలు



లింగంపేట: కేజీబీవీలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



నిజాంసాగర్: కస్తూర్బాలో ..

లింగంపేట/భిక్కనూరు/నిజాంసాగర్ : జిల్లాలోని పలు పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబురాలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంచి ముగ్గులు వేసిన వారికి బహుమతులు అందించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

డ్రమ్‌సీడర్‌పై రైతులకు అవగాహన



భిక్కనూరు: మండలంలోని లక్ష్మీదేవునిపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డ్రమ్ సీడర్‌తో వరి నాటు వేయడం గురించి అవగాహన కల్పించారు. యాసంగి పంటల సాగుపై రైతులకు పలు సూచనలు అందజేశారు. వరి నారు మడిలో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు ఏడీఏ అపర్ణ వివరించారు. ఏవో రాధ, ఏఈవో వినోద తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్(బాన్సువాడ): కొత్తబాది మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని బుధవారం ప్రిన్సిపాల్ పక్కీరయ్య తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

గడువు పొడిగింపు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ జనరల్ గురుకుల, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశానికి ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పెద్దకొడప్‌గల్ గురుకుల పాఠశాల, కళాశాల హెచ్ఎం నళిని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు హాజరు కాదల్చిన విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతూ ఉండాలని చెప్పారు.

పార్టీలకతీతంగా అభివృద్ధికి తోడ్పడుదాం

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



రాజంపేటలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

భిక్కనూరు/దోమకొండ/రాజంపేట/మాచారెడ్డి/బీబీపేట: ఎన్నికల సమయంలోనే పార్టీలు చూడాలని, అభివృద్ధి విషయంలో పార్టీల కతీతంగా ఉందామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. బుధవారం భిక్కనూరు, రాజంపేట, దోమకొండ, మాచారెడ్డి,బీబీపేట మండలాల్లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని పార్టీల నేతలు, ప్రజలందరం కలిసి కామారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకుందామన్నారు. తాను ప్రజలందరి మనిషినని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



పెద్దకొడప్‌గల్ తహసీల్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్/పెద్దకొడప్‌గల్(జుక్కల్): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మద్నూర్, డోంగ్లీ, పెద్దకొడప్‌గల్ మండలాల్లో బుధవారం ఆయన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. ప్రణాళికా బద్దంగా నియోజకవర్గంలో పూర్తి అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. మద్నూర్ మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నూతన ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యే బస

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ క్యాంపు ఆఫీసులో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బస చేశారు. ఆఫీసులో కనీస సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులను ఆదేశించినా వారి నుంచి స్పందన లేకపోవడం పట్ల ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయండి



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మత బోధనలు చేస్తున్నారని, ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావుకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. పట్టణంలోని స్పార్క్‌మైండ్ పాఠశాలలో విద్యా హక్కు చట్టంకు వ్యతిరేకంగా మత బోధనలు చేస్తున్నారని, పాఠశాలలో కనీసం మూత్రశాలలు, ఆట స్థలం లేదని అన్నారు. అర్హతున్న ఉపాధ్యాయులు లేరని, ఆర్టికల్ 28(3) ప్రకారం విద్యార్థుల తల్లిదండ్రుల అనుమతి లేనిదే మత బోధనలు చేయరాదని అన్నారు. వెంటనే పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కోనాల గంగారెడ్డి, సాయికిరణ్, వెంకట్, సునీల్, సాయిప్రసాద్, మహేందర్ ఉన్నారు.

'ఎల్ఐసీ యాజమాన్యం మొండివైఖరి వీడాలి'



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న జేఏసీ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: భారతీయ జీవిత బీమా సంస్థలో ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, సత్వర వేతన సవరణ, ఉద్యోగుల నూతన పెన్షన్ స్కీంలో యాజమాన్య వాటాను 10 నుంచి 14 శాతం పెంచాలని ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ కామారెడ్డి శాఖ కార్యదర్శి కాసాల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు.

ఎల్ఐసీలోని అన్ని తరగతుల ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం ఎల్ఐసీ కామారెడ్డి శాఖ ఎదుట గంట సేపు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ.. సిబ్బంది డిమాండ్ల సాధనలో ఎల్ఐసీ యాజమాన్యం మొండి వైఖరికి వ్యతిరేకంగా దశల వారిగా నిరసన తెలుపుతున్నామన్నారు. జేఏసీ ప్రతినిధులు పి.సంపత్, సీహెచ్.ప్రవీణ్, ఇక్బాల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యక్షత్రియ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన దేవునిపల్లి ఆర్యక్షత్రియ సంఘం సభ్యులు



అంబేడ్కర్ సంఘం సభ్యులు..

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామ ఆర్యక్షత్రియ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నిట్టు రవీందర్, కార్యదర్శిగా భోజన్నగారి అర్జున్ రావు, ఉపాధ్యక్షుడిగా చిన్నోల్ల శంకర్ రావు, సహాయ కార్యదర్శిగా ఇస్రోజీవాడి రఘుపతిరావులు ఎన్నికయ్యారు. సలహాదారులుగా పెద్దోల్ల శ్యామ్ రావు, భోజన్నగారి రాజుపాటిల్, నిట్టు రాజేశ్వర్ రావు, నిట్టు నారాయణరావు, నిట్టు లింగారావు, పెద్దోల్ల శివాజీరావు, నిట్టు వెంకట్‌రావు, ఉనుగురి భాస్కర్ రావు, పోలీస్ క్రిష్ణాజీరావు, పెద్దోళ్ల రాజేందర్‌రావులు ఎన్నికయ్యారు.

అంబేడ్కర్ సంఘం కార్యవర్గం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): దేమికలాన్‌లో అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు పోతరాజు సాయిలు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా బాలయ్య, అధ్యక్షుడిగా దడిగే శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా గడ్డ బాలురాజు, కొనింటి స్వామి, ప్రధాన కార్యదర్శిగా గిద్దెస్వామి, సహాయ కార్యదర్శిగా సందరాజు, కోశాధికారిగా సంద రఘుపతి, ముఖ్య సలహాదారులుగా భూపతి, సాయిలు, లక్ష్మణ్‌లను ఎన్నుకున్నారు.

సంక్షిప్తం

పరీక్షలంటే భయాన్ని వీడాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పదో తరగతి విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని వీడాలని నాగిరెడ్డిపేట ఎంఈవో వెంకటేశం సూచించారు. నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలతోపాటు గోపాల్‌పేట హైస్కూల్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలను కష్టంతో కాకుండా ఇష్టంతో సన్నద్ధం కావాలన్నారు.

ఫిబ్రవరిలో ఒక రోజు సమ్మె

కామారెడ్డి అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరిలో ఒక రోజు సమ్మె నిర్వహించనున్నట్లు టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయస్ ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ చైర్మన్ సుభాష్ లంబా నిర్వహించిన సమ్మె సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో టీఎన్‌జీవోల సంఘం ప్రతినిధులు పాల్గొని సుభాష్ లంబాతో పాటు కొత్తగా ఎన్నికైన ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు జగదీష్‌ను సన్మానించారు.

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన

బాన్సువాడ: బీర్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీవో భాను ప్రకాష్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను సునిశితంగా పరిశీలన చేసి నమోదు చేయాలన్నారు.

సదాశివనగర్ పరిధిలో 12,700 దరఖాస్తులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ నెల 6 వరకు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి 12,700 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో లక్ష్మి తెలిపారు. ఇప్పటికి 8,071 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

ఉద్యమకారుల దరఖాస్తు ఫారాల అందజేత

రాజంపేట: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు ప్రభుత్వం అడిగిన నేపథ్యంలో కొండాపూర్‌కు చెందిన 10 మంది తెలంగాణ మలిదశ ఉద్యమకారులు బుధవారం దరఖాస్తు పత్రాలను అందజేశారు. తాము 2009లో తెలంగాణ ఉద్యమ సమయంలో పాల్గొన్న వివరాలు, ఎఫ్ఐఆర్, చార్జిషీట్ తదితర వివరాలను దరఖాస్తు ఫారంతో జతచేసి తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు అందజేసినట్లు తెలిపారు.

ఘనంగా హిందీ దివస్

భిక్కనూరు: జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ హిందీ దివస్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ భాషపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. హెచ్ఎం రాజేంద్ర ప్రసాద్, హిందీ ఉపాధ్యాయుడు గఫూర్ శిక్షక్, ఉపాధ్యాయులు తబిత, కోటేశ్వరి, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

ఎల్లారెడ్డి: సేవాలాల్ జయంతికి ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ గోర్‌సేన బంజారా సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు వినతిపత్రం అందించారు. గిరిజనుల ఆరాధ్యదైవమైన సేవాలాల్ జయంతికి ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు. సంఘం యూత్ నాయకులు ప్రేమ్, సాయి, సాయిబాబా తదితరులున్నారు.